నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, గురువారం 23 మే 2024 | VIKARABAD


మొయినాబాద్‌లోని నాగిరెడ్డిగూడ పాఠశాలను సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

## పాఠశాల పనులను వేగవంతం చేయాలి

**రంగారెడ్డి కలెక్టర్ శశాంక**

మొయినాబాద్, మే22: విద్యా సంవత్సరం ప్రారంభంలోపు అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. మండల పరిధిలోని చందానగర్ జిల్లా పరిషత్, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో జరుగుతున్న 'అమ్మ ఆదర్శ పాఠశాల' పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 51 పాఠశాలలు ఉన్నాయన్నారు. అందులో 5 జిల్లా పరిషత్ పాఠశాలలు, 14 ప్రాథమిక పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కింద అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఆ పనుల కోసం రూ. 1లక్ష నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో మరుగు దొడ్లు, విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట డీఈవో సుశీందర్‌రావు, టీడబ్ల్యూ ఈఐడీసీ ఈఈ కుమార్‌గౌడ్, తహసీల్దార్ గౌతంకుమార్, ఎంపీడీవో సంధ్య, ఎంఈవో వెంకటయ్య, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వప్న ఉన్నారు.

## ఆదర్శ పాఠశాలల నిధులు సద్వినియోగం చేసుకోవాలి

**వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**

యాలాల,మే22: అమ్మ ఆదర్శ పాఠశాలకు వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం యాలాల మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఉర్దు మాధ్యమ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా చేపడుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల చివరి వరకు పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఏకరూప దుస్తులు తయారు చేస్తున్న కేంద్రాన్ని పరిశీలించి దుస్తుల తయారీలో నాణ్యత పాటించడంతో పాటు నిర్ణీత సమయం కంటే ముందే దుస్తులను ఇవ్వాలన్నారు. వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించి 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ వెంట అధికారులు ఉన్నారు.


యాలాల మండల కేంద్రంలో అమ్మ ఆదర్శ పాఠశాలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

## తుర్కయాంజాల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి సస్పెన్షన్



తుర్కయాంజాల్, మే 22 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణరెడ్డిని సస్పెండ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ దివ్య ఉత్తర్వులు జారీ చేశారు. సత్యనారాయణరెడ్డి గతంలో నిర్మల్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన క్రమంలో 44 మంది పారిశుధ్య సిబ్బంది, ఇతర సిబ్బందిని నిబంధనలకు విరుద్ధంగా నియమించినందుకుగాను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. దీనిపై విచారణ అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.




వికారాబాద్ జిల్లా నవాబ్ పేట మండలం గంగ్యాడలోని చెక్‌డ్యాం

# నాటి పనితీరుకు.. నేడు అవార్డులు

### దక్షిణాదిలోనే వికారాబాద్ జిల్లా ఉత్తమం..

- జలసంరక్షణలో ఉత్తమ జిల్లాగా నామినేట్
- ఉత్తమ గ్రామ పంచాయతీల్లో దాదాపూర్..
- గత బీఆర్‌ఎస్ పాలన ఫలాలకు దక్కిన గౌరవం
- ఇంకుడు గుంతలు, చెక్‌డ్యాంలు, నీటి ఊట గుంతల నిర్మించిన కేసీఆర్ సర్కార్
- పల్లెప్రగతి కార్యక్రమంతో గ్రామ పంచాయతీల్లో సమూల మార్పులు
- జిల్లాలోని 29 గ్రామ పంచాయతీలకు జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు

**కేసీఆర్ సుపరిపాలన ఫలాలకు ఇప్పటికీ అవార్డులు దక్కుతున్నాయి. బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో గుర్తింపు లభిస్తూనే ఉన్నది. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని గుర్తించిన కేసీఆర్ 'పల్లెప్రగతి'కి శ్రీకారం చుట్టి పల్లెల్లో సకల వసతులు కల్పించడంతోపాటు నీటి సరంక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టారు. భూగర్భ జలాల పెంపునకు చెరువుల్లో పూడిక తీయించడంతోపాటు ఇంకుడు, ఊట గుంతలు, చెక్‌డ్యాంలను నిర్మించారు. వీటి ఫలాలు ఇప్పటికీ ప్రజలకు అందుతుండగా.. ప్రతిష్టాత్మక అవార్డులు సైతం లభిస్తున్నాయి. తాజాగా జల సంరక్షణలో దక్షిణాది రాష్ట్రాల్లోనే వికారాబాద్ ఉత్తమ జిల్లాగా నామినేట్‌కాగా, ఉత్తమ గ్రామ పంచాయతీల్లో కులకచర్ల మండలంలోని దాదాపూరు గ్రామం నామినేట్ అయ్యింది.**

**-వికారాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ)**

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్న గ్రామ పంచాయతీలు, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ కేసీఆర్ చేపట్టిన ప్రగతి పనులకు అవార్డులు దక్కుతున్నాయి. జలసంరక్షణ, భూగర్భ జలాల పెంపు విభాగంలో దక్షిణాది రాష్ట్రాల్లోనే వికారాబాద్ ఉత్తమ జిల్లాగా నామినేట్ అయ్యింది. దీంతోపాటు ఏపీలోని విశాఖపట్నం జిల్లా కూడా నామినేట్ కాగా, మొదటి లేదా రెండో ఉత్తమ జిల్లా అవార్డు మన జిల్లాకు దక్కనున్నది. అదేవిధంగా ఉత్తమ గ్రామ పంచాయతీల కేటగిరీలో కుల్కచర్ల మండలంలోని దాదాపూర్ గ్రామం నామినేట్ అయ్యింది. బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన వర్షపు నీటిని ఒడిసి పట్టే కార్యక్రమాలే ఈ గుర్తింపు రావడానికి కారణం. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఇంటింటికీ ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, నీటి ఊట గుంతలు, చెక్‌డ్యాంలు, ఖండిత కందకాలు, నీటి కుంటలు, ఫారం పాండ్‌లను తవ్వకాన్ని ఉద్యమంలా చేపట్టింది. ఇందుకోసం అధిక నిధులను వినియోగించింది. ప్రధానంగా ప్రతి ఒక్కరూ ఇంటింటికీ ఇంకుడు గుంత నిర్మించుకునేలా పెద్ద ఎత్తున అవగాహన కల్పించింది. వీటి ఫలాలే నేటికి ప్రజలకు అందుతున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కొట్లాది రూపాయలు వెచ్చిస్తే.. కాంగ్రెస్ మాత్రం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

### జీపీలకు జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు...

బీఆర్‌ఎస్ హయాంలో జిల్లాలోని గ్రామ పంచాయతీల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడింది. ప్రత్యేకంగా నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని అమల్లోకి తీసుకు వచ్చి కనీవినీ ఎరుగని విధంగా అభివృద్ధిలోకి తీసుకువచ్చారు. దీంతోని జిల్లాలోని 29 గ్రామ పంచాయతీలు జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు దక్కాయి. కేసీఆర్ సర్కార్ పల్లెప్రగతిలో భాగంగా జిల్లాకు భారీగా నిధులు మంజూరు చేసింది. ప్రతి నెలా రూ.18 కోట్ల చొప్పున జిల్లాలోని గ్రామ పంచాయతీలకు అందిస్తూ వచ్చింది. ఈ నిధులను అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, అంతర్గత రోడ్లు, పారిశుధ్య నిర్వహణ, గ్రామ పంచాయతీ ట్రాక్టర్ లోన్‌కు సంబంధించిన కిస్తీలు, ప్రభుత్వ కార్యాలయాల కరెంట్ చార్జీలు తదితర వాటికి వినియోగించేవారు. అదేవిధంగా జిల్లాలోని 566 గ్రామ పంచాయతీలతో పాటు 307 హాబిటేషన్‌లలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసి ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించారు.ఇలా గ్రామాలను అన్ని రకాలుగా తీర్చిదిద్దడంతో ప్రజలు దర్జాగా ఉండేవారు.

### పల్లె ప్రగతితో మారిన రూపురేఖలు..

పల్లె ప్రగతి పనులో గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. గ్రామానికో ట్రాలీ, ట్యాంకర్‌తో కూడి ట్రాక్టర్, వైకుంఠధామం, డంపింగ్ యార్డు, కంపోస్టు షెడ్డు, పల్లెప్రకృతి వనాలు, క్రీడా మైదానాలు వంటి మౌలిక వసతులతో పల్లెల్లో పచ్చదనం, పరిశుభ్రత వెల్లివిరిసింది. జిల్లాలో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటుకుగాను గత ప్రభుత్వం రూ.9 లక్షలను ఖర్చు చేసింది. ప్రతీ గ్రామ పంచాయతీకి కేటాయించిన 10 శాతం గ్రీన్ బడ్జెట్ నుంచి ప్రకృతి వనాల నిర్వహణకు ఖర్చు చేసేవారు. ట్రాక్టర్లతో నిత్యం గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించడం, హరితహారం మొక్కలకు నిత్యం నీరు అందించేవారు. కేసీఆర్ సర్కార్ సకాలంలో నిధులు అందివ్వడంతో పనులు సక్రమంగా జరిగి ఎలాంటి సమస్యలు ఉత్పన్నమయ్యేవి కావు. కానీ ప్రస్తుతం నిధులు అందకపోవడంతో పల్లెల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది.

### బీఆర్‌ఎస్ హయాంలో రూ.700 కోట్లు..


బీఆర్‌ఎస్ హయాంలో జిల్లాలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి రూ.700 కోట్ల నిధులు అందాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో 30 కోట్లు, 2017-18లో రూ.32 కోట్లు, 2018-19లో రూ.23.12 కోట్లు, 2019-20లో రూ.89.05 కోట్లు, 2020-21లో రూ.128.22 కోట్లు, 2021-22లో రూ.114.22 కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.277.72 కోట్ల నిధులను కేసీఆర్ ప్రభుత్వం విడుదల చేసింది.


వికారాబాద్ మండలం పెళ్లమడుగులోని ఇంకుడుగుంత



## కేంద్రం కొర్రీ.. రైతులు వర్రీ

- పీఎం కిసాన్ సమ్మాన్ యోజన నిధి పథకంలో కోత
- ఏటా తగ్గుతూ వస్తున్న రైతుల సంఖ్య
- మొదటి విడుతలో 1,93,189 మందికి.. 15వ విడుతకు వచ్చేసరికి 1,14,055 మందికే..
- రంగారెడ్డి జిల్లాలో ఏటా వేల సంఖ్యలో రైతులకు మొండిచెయ్యి!
- నిబంధనలు సడలించని కేంద్రం.. కొత్తవారికి దక్కని సాయం



రంగారెడ్డి, మే 22(నమస్తే తెలంగాణ) : 'కేంద్ర ప్రభుత్వ పథకాల తీరు 'ఆర్భాటమే తప్ప.. ఆచరణ శూన్యం' అన్నట్లుగా ఉంటున్నది. ఇందుకు పీఎం కిసాన్ సమ్మాన్ యోజన నిధి పథకమే ఉదాహరణ. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన రైతు బంధు పథకాన్ని కాపీ కొట్టిన కేంద్రం పీఎం కిసాన్ పథకాన్ని చేపట్టినప్పటికీ అమలులో మాత్రం బోల్తా పడింది. 2019లో విధించిన నిబంధనలను కేంద్రం సడలించకపోవడంతో ఈ పథకం కింద కొంతమంది రైతులకే ప్రయోజనం చేకూరుతున్నది. రంగారెడ్డి జిల్లాలో 2018లో మొదటి విడుతలో 1,93,189 మందికి రూ.38.63కోట్ల సాయాన్ని కేంద్రం అందించగా.. 15వ విడుతకు వచ్చేసరికి లబ్ధిపొందుతున్న రైతుల సంఖ్య 1,14,055 మందికి తగ్గింది.

### సాయంలో కేంద్రం ధోకా..

కేంద్రం 2018 సంవత్సరం నుంచి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో కొత్త పథకాన్ని అమలు చేసింది. ఏటా మూడు విడుతల్లో రూ.2వేల చొప్పున రూ.6వేలను అందజేస్తున్నది. మొదటి సంవత్సరం ఒక విడుతలోనే రూ.2వేల చొప్పున 1,93,189 మందికి రూ.38.63కోట్లను అందించింది. ఆ తర్వాత సంవత్సరం నుంచి సాయం పొందే రైతుల సంఖ్య క్రమక్రమేణా తగ్గుతూ వస్తున్నది. 15వ విడుతలో 1,14,055 మంది రైతులకు రూ.22.81కోట్ల సాయం అందింది. ప్రస్తుతం 16వ విడుత పంపిణీ కార్యక్రమం కొనసాగుతుండగా.. మే 22 వరకు 88,672 మంది రైతులకు రూ.17.73కోట్ల సాయం మాత్రమే అందింది. పంపిణీ పూర్తయ్యే సరికి రైతుల సంఖ్య లక్షలోపే ఉన్నా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదనే వాదన ప్రజల్లో వినిపిస్తున్నది.

### నిబంధనల కొర్రీ..

కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ యోజన నిధి పథకం అర్హతకు సవాలక్ష ఆంక్షలు, నిబంధనలను పెట్టింది. 2019 ఫిబ్రవరిలోపు పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్న రైతులకు మాత్రమే ఈ పథకాన్ని అర్హులని నిర్ణయించడంతో ఆతర్వాత పాసు పుస్తకాలు పొందిన చాలామంది రైతులు పీఎం కిసాన్ పథకం కింద సాయాన్ని పొందలేక పోయారు.

ఈ పథకం కింద సాయం పొందుతున్న రైతులు ఆదాయ పన్ను చెల్లించినా, మరణించినా, ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా ఆటోమెటిక్‌గా రైతుల పేరు తొలగిపోతున్నది. ఒకే కుటుంబంలో ఇద్దరి వ్యక్తుల పేరిట భూములు ఉంటే ఒక్కరికే ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. 2019 తర్వాత కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలను పొందినవారు పీఎం కిసాన్ పథకం కింద సాయం పొందలేక పోతున్నారు. పథకం అమలు చేసే సమయంలో ఖరారు చేసిన నిబంధనల్లో మార్పులు చేయకపోవడమే ఇందుకు కారణం. కేంద్ర విధానంపై జిల్లా రైతాంగం మండిపోతున్నది.

**ఏటా తగ్గుతూ వస్తున్న రైతుల సంఖ్య, సాయం వివరాలు ఇలా..**

| సంవత్సరం | విడుత | రైతులు | సాయం (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| 2018 | 1 | 1,93,189 | రూ.38.63 |
| 2019 | 2 | 1,90,660 | రూ.38.12 |
| | 3 | 1,84,201 | రూ.36.84 |
| | 4 | 1,79,045 | రూ.35.80 |
| 2020 | 5 | 1,78,029 | రూ.35.60 |
| | 6 | 1,75.844 | రూ.35.16 |
| | 7 | 1,72,038 | రూ.34.40 |
| 2021 | 8 | 1,69,848 | రూ.33.96 |
| | 9 | 1,66,746 | రూ.33.34 |
| | 10 | 1,60,189 | రూ.32.03 |
| 2022 | 11 | 1,52,303 | రూ.30.46 |
| | 12 | 1,37,205 | రూ.27.44 |
| | 13 | 1,17,629 | రూ.23.52 |
| 2023 | 14 | 1,19,906 | రూ.23.98 |
| | 15 | 1,14,055 | రూ.22.81 |
| | 16 - 88,672 | | రూ.17.73 |

(22 మే 2024 వరకు)

## తింటే.. కడుపు ఆగమే..

- రెస్టారెంట్ ఫుడ్ కంపుకంపు
- కుళ్లిన ఆహార పదార్థాలు.. పాచిన వంటలు
- పేరున్న హోటళ్లలో బయటపడుతున్న డొల్లతనం
- తాజాగా కేఎఫ్‌సీ, కృతుంగ, రెస్టో బార్‌లోనూ..
- నాణ్యతలేని ఆహారం వెలుగులోకి..

సిటీబ్యూరో, మే 22(నమస్తే తెలంగాణ) : రెస్టారెంట్ ఫుడ్ అంటేనే భయాభ్రాంతులకు గురయ్యే పరిస్థితులు వస్తున్నాయి. బ్రాండెండ్ పేర్లతో జనాలను ఆకట్టుకుంటున్నా... రుచికరమైన ఆహారానికి బదులు.. పాచిన, పురుగులు పట్టిన పదార్థాలతో జనాలకు వండి వారిస్తున్నారు. ఇదేదో రోడ్ సైడ్ ఫుడ్ స్టాల్స్ అనుకుంటే పొరపాటే. హైదరాబాద్ నగరంలోనే పేరున్న రెస్టారెంట్లు కూడా ఇదే తరహాలో కల్తీ, నాణ్యత లేని పదార్థాలతో ఆహారాన్ని వండి జనాల ప్రాణాల మీదకు తీసుకొస్తున్నాయి. గతంలో నగరంలో ఉండే గలీజ్ రెస్టారెంట్ల బాగోతాలను వెలుగులోకి తీసుకొచ్చిన... ఫుడ్ సేఫ్టీ అధికారులు... తాజాగా నిర్వహించిన తనిఖీల్లోనూ కళ్లు బైర్లు కమ్మి, కంపు కొట్టే వాసనతో, పురుగులు పట్టిన పదార్థాలను చూసి.. వాంతులు చేసుకునే పరిస్థితి. ఇలా జనాలతో ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నగరంలోని రెస్టారెంట్లలో కేఎఫ్‌సీ, కృతుంగ, రెస్టో బార్ వంటి ఫేజ్ త్రీ హోటల్స్, బార్స్ అండ్ రెస్టారెంట్లు కూడా ఉండటం గమనార్హం.

### రుచి ఉండదు.. శుచీ అసలే పాటించరు..

- రుచి ఉండదు. శుచీ అసలే పాటించరు. కానీ పేరుకు మాత్రం లగ్జరీ హోటల్, ఫ్యామిలీ రెస్టారెంట్ అంటున్నా.. వంట గదులు చూస్తే..కడుపులో తిప్పడం ఖాయం.
- తాజాగా వరుసగా బయటపడుతున్న ఈ తరహా పాచిన వంటలు జనాలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. అసలే శరీరానికి సరైన పోషకాలు అందక, ఆహార సమతుల్యత లోపించి వ్యాధులు ప్రబలుతుంటే... కనీసం ఒక్క పూటైన మంచి రుచికరమైన భోజనం చేద్దామనుకున్నా ఎంతోమంది కడుపులను విష భోజనాలతో నింపుతున్నారు. గ్రేటర్ పరిధిలో ఇటీవల కాలంలో తనిఖీలు ముమ్మరం చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు.. తీరు మార్చుకోని హోటళ్ల నిర్వాహకులపై చర్యలకు దిగుతున్నారు.

### కుళ్లిన ఆహార పదార్థాలు.. పాచిన వంటకాలు

సోమాజిగూడలోని కృతుంగ పాలేగార్స్ క్యూజన్, హెడ్ క్వార్టర్ రెస్టో బార్, కేఎఫ్‌సీ రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ, జీహెచ్‌ఎంసీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రెస్టారెంట్లు, హోటళ్లలో వాడుతున్న నాణ్యత లేని, కల్తీ, కుళ్లిన ఆహార పదార్థాలు, వస్తువులను గుర్తించారు. కృతుంగ రెస్టారెంట్‌లో ఎక్స్‌పైరీ డేట్, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ గుర్తింపు లేని 6 కిలోల పన్నీరు, గడువు ముగిసిన ఆరు కిలోల మేతి మలాయి, నాన్ వెజ్ పేస్ట్, పురుగులు, కీటకాలు, ఎలుకలు, బల్లులు, చెత్తాచెదారం నిండిన వంట గదిని చూసిన అధికారులు విస్తుపోయారు. పేరుకు పెద్ద బార్‌గా గుర్తింపు పొందిన రెస్టో బార్‌లోనూ దొరికిన పిజ్జా బేస్‌లకు ఎలాంటి లేబుల్ లేదనీ, ఇక ఫ్రిజ్‌లో ఉంచిన ఆహార పదార్థాలను కూడా సరైన రీతిలో నిల్వ చేయలేదని గుర్తించారు. ఇలా ఈగలు, బొద్దింకలు, కుళ్లిన ఆహార పదార్థాలతో వంటకాలను చేసి నగర ప్రాణాలతో రెస్టారెంట్లు చెలగాటమాడుతున్నాయి.

